

# 'మి(మ)నీ ఇండియా'గా

కొత్తూరు రూరల్, న్యూస్‌లైన్ :

విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయంగా..ఉద్యోగ, ఉపాధి కల్పనకు కేంద్రంగా.. సర్వమత సమ్మేళనంగా వెలుగొందుతూ కొత్తూరు మండలం 'మి(మ)నీ ఇండియా' పేరు గాంచింది. పారిశ్రామిక రంగం, రియల్‌ఎస్టేట్ పరంగా, విద్యా, వైద్యరంగంలో కూడా జిల్లాలో తలమానికంగా నిలిచింది. వెనకబడిన పాలమూరు జిల్లాను అభివృద్ధి చేయాలనే దృక్పథంతో 1976లో దివంగత ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఈ ప్రాంతంలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌కు కేవలం 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ మండలంలో 72 వేల మంది జనాభా ఉంది. వీరిలో 30 వేల మంది కార్మికులు, 12 వేలమంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పారిశ్రామికవాడతో పాటు తిమ్మాపూర్, నందిగామ, ఇన్ముల్‌నర్వ, వీర్లపల్లి, రంగాపూర్, కొడిచర్ల, అంతిరెడ్డిగూడ, మేకగూడ గ్రామాల్లో 130 కి పైగా భారీ, మధ్య, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటిలో ఫైబర్ గ్లాస్, మద్యం, కాస్మోటిక్స్ సబ్బులు, ప్లాస్టిక్, గ్యాస్ సిలిండర్లు, ఎరోకాన్ షీట్స్, బ్యాటరీ, సీడ్స్, బిస్కెట్స్, స్టీల్, ఫార్మా కంపెనీలు వెలిశాయి. ఈ పరిశ్రమల్లో బీహార్, ఒడిస్సా, గుజరాత్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాలకు చెందిన ప్రజలతో పాటు మనజిల్లా వాసులు కూడా ఉపాధి పొందుతున్నారు.




# కొత్తూరు

## సర్వమత సమ్మేళనం

ఢిల్లీ, యూపీ, బీహార్ ప్రజలు విజయదశమి పండుగను ఘనంగా జరుపుకుంటారు. దుర్గామాత విగ్రహాన్ని ఇక్కడే మట్టితో తయారుచేసి తొమ్మిది రోజుల పాటు నవరాత్రులు నిర్వహిస్తారు. కేరళవాసులకు ముఖ్యపండగ ఓనం రోజున మళయాలీలు వారి సంప్రదాయ దుస్తులు ధరించి పుష్పలతో రంగవల్లులు తీర్చిదిద్దుతారు. రాజస్థాని స్త్రీలు తమ సహజమైన వేషాధారణతో దీపావళి రోజున లక్ష్మీపూజను ఎంతో సంతోషంగా జరుపుకుంటారు.

## ప్రగతి పథంవైపు..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించే దిశలో మామిడిపల్లి గ్రామ శివారులో సింబియాసిస్, టాటా యూనివర్సిటీలకు శ్రీకారం చుట్టారు. దాదాపు 84 ఎకరాల్లో ₹300 కోట్ల వ్యయంతో సింబియాసిస్ యూనివర్సిటీ పనులు చురుగ్గాసాగుతున్నాయి. పెంజర్ల గ్రామ సమీపంలో 100 ఎకరాల్లో ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్ కాస్మోటిక్స్ పరిశ్రమ ₹800 కోట్ల ప్రతిష్ఠ పనులు జరుగుతున్నాయి. చేగూరు గ్రామ శివారులో టెక్స్‌టైల్ పరిశ్రమ నిర్మాణదశలో ఉంది. ఓసీపీ ఫైబర్‌గ్లాస్, పిట్టి ల్యామినేషన్, హెచ్‌టీఎల్, నాట్కో ఫార్మా, వినాయక, తిరుపతి స్టీలు పరిశ్రమల్లో వేలాదిమంది కార్మికులు పనిచేస్తుంటారు. రియల్‌బూమ్ పుణ్యమా! అంటూ ఇక్కడ ఎకరాకు కోటిరూపాయల పలుకుతోంది. మండలంలో దాదాపు 70కిపైగా వెంచర్లు ఏర్పాటయ్యాయి.

సింబియాసిస్ యూనివర్సిటీ



## మతసామరస్యానికి ప్రతీక

జిల్లాలోనే అతి ప్రాచీనమైన జహంగీర్ పీర్‌దర్గా(జేపీ దర్గా), ఫాతిమా మాత మందిరం, అయ్యప్పస్వామి ఆలయం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. జేపీ దర్గాలో ఏటా జనవరి మాసంలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. అదేవిధంగా ఫాతిమామాత క్షేత్రంలో ఏటా మే 13న మేరి మాత ఉత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక రైలును నడుపుతుంది. అయ్యప్పస్వామి దేవాలయంలో డిసెంబర్ 26,27 తేదీల్లో మండల ముగింపు పూజలను కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి దేవాలయ పూజల తరహాలో నిర్వహిస్తుండడం విశేషం. ఏటా కార్తీకమాసంలో భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేస్తారు.



శంషాబాద్ విమానాశ్రయంలోని దుకాణాల సముదాయం